క్లుప్తంగా

రేపు జిల్లాస్థాయి క్రీడా పోటీలు

రామాపురం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్ – 14, అండర్ 17 బాలుర, బాలికల త్రోబాల్ క్రీడా పోటీలను మండల పరిధిలోని నీలకంఠ్రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 31న నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు సుజాతమ్మ, ఆర్గనైజర్ నరేంద్రకుమార్‌రెడ్డిలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని క్రీడాకారులు, వ్యాయమ ఉపాధ్యాయులు 31న ఉదయం 9గంటలకే హాజరుకావాలని, క్రీడా పోటీలు సజావుగా కొనసాగేందుకు సహకరించాలని తెలియజేశారు.

బెటాలియన్‌ను సందర్శించిన జడ్జి



మాట్లాడుతున్న సిద్దవటం జడ్జి శ్రీనివాసకళ్యాణ్

సిద్దవటం : సిద్దవటం కోర్టు జడ్జి శ్రీనివాస కళ్యాణ్ ఆదివారం ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పోలీసుల అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీసుల నిస్వార్థ సేవలు, వారి త్యాగాల అంశాలపై ప్రసంగించారు. అనంతరం జడ్జిని అడిషనల్ కమాండెంటు కె.ప్రభుకుమార్‌కు మెమెంటోను ప్రదానం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంటు కె. ప్రభుకుమార్, అసిస్టెంటు కమాండెంట్లు వి.కేశవరెడ్డి, కె.వెంకటరెడ్డి, వి.జయప్రసాద్‌రెడ్డి, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాజంపేట వాసికి డాక్టరేట్



డాక్టర్ రామాంజనేయులు

రాజంపేట టౌన్ : పట్టణంలోని సరస్వతీపురం వీధికి చెందిన తమ్మిశెట్టి రామాంజనేయులకు జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూ) డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ విషయాన్ని ఆయన ఆదివారం ఇక్కడి విలేకరులకు తెలిపారు. రాజంపేటలోని ఏఐటీఎస్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎల్.హరికృష్ణ పర్యవేక్షణలో ఫ్లూయిడ్ మెకానిక్స్‌పై పరిశోధన చేసినందుకు జేఎన్‌టీయూ తనకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆయన తెలిపారు. కాగా రామాంజనేయులు తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో మ్యాథ్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.


పరామర్శ



దాదాసాహెబ్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి టౌన్ : దాదా సాహెబ్ సేవలు మరవలేనివని రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని డాక్టర్ దాదా సాహెబ్ పెద్ద ఖర్మ కార్యక్రమంలో భాగంగా ఆయన కుటుంబ సభ్యులను శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దాదాసాహెబ్ డాక్టర్‌గా, రాజకీయ నాయకుడిగా, ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా, మత పెద్దగా ప్రజలకు ఎనలేని సేవలందించారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మదనపల్లె పరిశీలకుడు హబీబుల్లాఖాన్, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ నవరంగ నిస్సార్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



నవీన్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

రాజంపేట రూరల్ : ఆర్యవైశ్యులకు, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవలందించే ప్రజా సేవకుడు సనిశెట్టి నవీన్‌కుమార్ అని ఆర్యవైశ్యులు కొనియాడారు. స్థానిక సనిశెట్టి కార్యాలయంలో ఆదివారం కౌన్సిలర్ సనిశెట్టి నవీన్‌కుమార్‌కు ఆర్యవైశ్యులు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్.మురళీ, బి.సత్య, పి.చంద్ర, పి.నరసింహరావు, ఎస్.రమేష్, ఎన్.రామకృష్ణ, ఎస్.సుధాకర్, ఎస్.నరసింహరావు, ఎస్.చంద్ర, ఎస్.ఇంద్ర, ఎస్.మధు, ఎస్.నరేంద్ర, వై.అవినాష్, నితిన్, పి.వినయ్, ఆర్.శరత్, వి.శివబాలాజీ, పి.వినయ్, రాజా శ్రీనివాస్, బి.యశ్వంత్‌లు ఉన్నారు.

కోలుకున్న బాధితులు

కలికిరి: మర్రికుంటపల్లిలో శనివారం సాయంత్రం పిడుగుపాటుకు గురైన బాధితులు కోలుకున్నారు. మర్రికుంటపల్లి గ్రామం కడియాలవారిపల్లికి చెందిన సి.సహదేవయ్య, సి.జయలక్ష్మమ్మ, జే.గణేష్, అక్కరాజమ్మలు పొలం వద్ద పిడుగుపాటుకు గురయ్యారు. వీరిలో సహదేవయ్య, జయలక్ష్మమ్మ పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో కలికిరిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొంది ఆదివారం కోలుకుని ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయ్యారు.

వర్షాలు కురిపించు.. తల్లీ గంగమ్మ!

లక్కిరెడ్డిపల్లె : వర్షాలు కురిపించి ప్రజలు సుభిక్షంగా ఉండేలా చూడు గంగమ్మ తల్లీ అంటూ ఆదివారం అనంతపురంలో వెలసిన శ్రీ కుర్నూతల గంగమ్మకు భక్తులు బోనాలు, తలనీలాలు అర్పించి ప్రత్యేక పూజలు చేయించారు. గంగమ్మకు ఆలయ పూజారులు ఆదిమూలం వంశీయులు రెడ్డి శేఖర్, చంద్రశేఖర్‌లు అమ్మవారికి అభిషేకం చేయడంతో పాటు కుంకుమార్చనలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని పూలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అమ్మవారి దర్శనార్థం పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇరుగులమ్మకు పూజలు

సిద్దవటం : మండలంలోని సిద్దవటం గ్రామ శివారులో కొలువైన శ్రీ ఇరుగులమ్మకు ఆదివారం విశేష పూజలు నిర్వహించినట్టు ఆలయ పూజారి వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, అలంకరణ, సహస్రనామార్చన, కుంకుమార్చన, అర్చనలు వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. కొందరు భక్తులు అమ్మవారికి భోనాలు సమర్పించి మొక్కుబడులను చెల్లించి తీర్థ ప్రసాదాలను స్వీకరించినట్టు చెప్పారు.



సిద్దవటం: ఇరుగులమ్మ మూలవిరాట్



సంబేపల్లె: నల్లగంగమ్మ దర్శనార్థం క్యూలైన్‌లో వేచిఉన్న భక్తులు

వీరభద్రుడికి పూజలు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో చంద్రగ్రహణం ముగియడంతో ఆదివారం తెల్లవారుజామున సంప్రోక్షణ చేసి స్వామి వారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారు, అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. దేవతామూర్తులను అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో అన్న ప్రసాదాన్ని అందించినట్లు ఆలయ పాలకమండలి అధ్యక్షురాలు పాలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డిలు తెలిపారు.

భక్తులతో కిటకిటలాడిన దేవరరాయి నల్లగంగమ్మ ఆలయం

సంబేపల్లె : రాయచోటి అన్నమయ్య జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన సంబేపల్లె శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచే అమ్మవారికి పూజలు ప్రారంభమయ్యాయి. రాయచోటితోపాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని పొల్లేరు రాతిపై పొర్లారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.



లక్కిరెడ్డిపల్లె: పూజలందుకున్న అనంతపురం గంగమ్మ



రాయచోటి టౌన్: వీరభద్ర స్వామి ఆలయంలో అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న భక్తులు

పొన్నవోలు గంగమ్మ ఆలయంలో చోరీ

సిద్దవటం : మండలంలోని పొన్నవోలు గ్రామంలోని గంగమ్మ గుడిలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ పొన్నవోలు గంగమ్మ గుడిలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గుడిలోని హుండీని పగులగొట్టి అందులో ఉన్న దాదాపు రూ. 40వేలు నగదును దొంగలించారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పెంచిన విద్యుత్ చార్జీలపై ఉద్యమిస్తాం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : విద్యుత్ చార్జీలు తగ్గించేంత వరకు ఉద్యమిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన క్షేత్ర స్థాయి ఉద్యమంలో భాగంగా సచివాలయాల వద్ద ఆందోళన చేపట్టాలని పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే విద్యుత్తు చార్జీలను పెంచబోమని, వ్యవసాయానికి, గృహ అవసరాలకు, పారిశ్రామిక రంగానికి నాణ్యమైన విద్యుత్తు అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారం చేపట్టిన నాలుగేళ్లలో సర్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు, ట్రూఅప్ చార్జీలు, మరిన్ని పేర్లతో అసాధారణ భారం వేస్తున్నారన్నారు. ఇందుకోసం ప్రజలతో సంతకాలు చేయించి గ్రామ, వార్డు సచివాలయాల ఆందోళన ద్వారా సీఎంకు వినతి పత్రాలు పంపనున్నట్లు తెలిపారు.

విరివిగా ఉచిత కంటి వైద్య శిబిరాలు



కంటి వైద్య శిబిరంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

- కంటి సమస్యలు లేని ఉమ్మడి వైఎస్సార్ జిల్లానే తమ లక్ష్యం
- జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి

రాజంపేట రూరల్ : ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు కంటి చూపునివ్వడాన్ని తన అదృష్టంగా భావిస్తున్నట్లు జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి తెలియజేశారు. మండల పరిధిలోని ఆకేపాడులోని ఆకేపాటి ఎస్టేట్‌లో ఆదివారం ఆకేపాటి ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర నేత్రాలయ కంటి వైద్యశాల సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముందుగా వైద్య శిబిరాన్ని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. శంకర నేత్రాలయ సిబ్బంది నిర్వహిస్తున్న కంటి పరీక్షలను ఆకేపాటి పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి కంటి చూపు ఇవ్వాలనేది తమ లక్ష్యమని తెలియజేశారు. కంటిచూపు లేని వారు మన ఉమ్మడి జిల్లాలలో ఉండకుండా చేసేందుకే విరివిగా ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఆకేపాటి అనీల్‌కుమార్‌రెడ్డి, నాయకులు బి.రామ్మోహన్ నాయుడు, పి.విశ్వనాథరెడ్డి, పోలి మురళీరెడ్డి, జీవీ సుబ్బరాజు, జి.మల్లికార్జునరెడ్డి, ఎస్.శ్రీనివాసులు, కె.శ్రీహరి, శంకర నేత్రాలయ వైద్యులు వి.మురళీకృష్ణ, వి.షణ్ముగం, పిల్లి జయప్రకాష్, ప్రజలు పాల్గొన్నారు. కాగా ఈ శిబిరంలో 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో మొదటి విడతగా 35 మంది కంటి ఆపరేషన్‌ల నిమిత్తం ఆస్పత్రికి పంపించారు.

వృద్ధాశ్రమానికి బియ్యం వితరణ



బియ్యం వితరణ చేస్తున్న దృశ్యం

చిట్వేలి: శ్రీ దత్తగిరి నారాయణ తపోవన అభయ ఆంజనేయస్వామి వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు చిట్వేలి జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు 1.30 క్వింటాళ్ల మసూర బియ్యాన్ని ఆదివారం వితరణ చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ భవిష్యతులోనూ ఈ ఆశ్రమానికి తమ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఆశ్రమ ధర్మకర్త నాగేశ్వరమ్మ తమవంతు సహకారం అందించిన పూర్వ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ చంద్ర, ఆశ్రమ వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

ఇంక్రిమెంట్లు ఇవ్వాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇతర ప్రభుత్వ బ్యాంకులతో సమానంగా కంప్యూటర్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని భారతీయ మజ్దూర్ సంఘ్ వైస్ ప్రెసిడెంట్ వెంగల్‌రెడ్డి సూచించారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ విషయమై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇప్పటికే తొమ్మిది గ్రామీణ బ్యాంకులు అమలు చేసినా ఏపీజీబీ యాజమాన్యం మాట దాటవేస్తోందన్నారు. ఈ విషయంపై బీఎంఎస్ యూనియన్ తరుపున కెనరా బ్యాంకు ఈడీకి, నాబార్డు చైర్మన్‌కు, ఫైనాన్స్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లామన్నారు.

20 లీటర్ల సారా స్వాధీనం

నిమ్మనపల్లె : అక్రమంగా సారా తరలిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతడి నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఆదివారం మండలంలోని తవళం పంచాయతీ చౌకిళ్లవారిపల్లె వద్ద స్థానికుడైన పఠాన్ అజీజ్ (75) సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. నిందితుడిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడిని ఖండిస్తూ నిరసన

రాయచోటి అర్బన్ : కావలిలో ఆర్టీసీ డ్రైవర్‌పై దాడిని నిరసిస్తూ ఆదివారం మధ్యాహ్నం స్థానిక ఆర్టీసీ డిపో ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి గేటు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు మాట్లాడుతూ కారుకు సైడ్ ఇవ్వలేదన్న కారణంగా కావలి వద్ద ఆర్టీసీ డ్రైవర్‌పై కొందరు దాడికి దిగడం దారుణమన్నారు. దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలంటూ డిమాండ్ చేశారు. ధర్నాలో వైఎస్ఆర్ ఎన్ఎంయూ నేత భోజనప్ప రామ్మోహన్, ఎంప్లాయీస్ యూనియన్ నేత కె.ఈశ్వరరెడ్డి, ఎన్ఎంయూ నేతలు ఆర్.వి.గోపాల్, ఎస్.పి.బాబుతోపాటు ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.



డిపో గేటు వద్ద ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

కలకడ : రోడ్డు ప్రమాదాల నివరణే లక్ష్యంగా పోలీసులు పనిచేస్తున్నారని సీఐ నాగేంద్ర తెలిపారు . ఆదివారం చిత్తూరు–కర్నూలు జాతీయరహదారిపై, కలకడ–గుర్రంకొండ రోడ్డు మార్గంలో మండలంలోని కె.బాటవారిపల్లె ఉన్నతపాఠశాల, ఇందరమ్మ కాలనీ, టమాట మార్కెట్ వద్ద కలకడ టమాట వ్యాపారులు వితరణ చేసిన 25 రోడ్డు స్టాపర్స్‌ను రోడ్డుపై వాహన రాకపోకలకు సమస్య రాకుండా, అతివేగం నివారణ కోసం ఏర్పాటు చేశారు. ద్విచక్రవాహన దారులు హెల్మెంట్ ధరించాలన్నారు. ఫోర్‌వీలర్ వాహనాలను నడిపేవారు సీటు బెల్ట్ ధరించాలని సూచనలు చేశారు. మండల పరిధిలో నిత్యం వాహన తనిఖీలు నిర్వహించి లైసెన్స్ లేని చిన్నారులకు వాహనాలు ఇచ్చినా వారి పెద్దలపై కేసులు, అనుమతికి మించి తరలించేవారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రెడ్డిపల్లి రైల్వేస్టేషన్‌కు పూర్వవైభవం కల్పించండి

పుల్లంపేట : బ్రిటీష్ కాలం నుంచి రెడ్డిపల్లి రైల్వేస్టేషన్‌కు ఎంతో ప్రత్యేకత ఉంది. రేణిగుంట తరువాత రెడ్డిపల్లి రైల్వేస్టేషన్‌కే బ్రిటీష్ వారు మొదటి ప్రాధాన్యత ఇచ్చారు. ఈ రైల్వేస్టేషన్ నుంచి మద్రాస్ పట్టణానికి చీని నిమ్మ, తమలపాకులు సరఫరా చేసేవారు. గత కాంగ్రెస్ హయాంలో రెడ్డిపల్లి రైల్వేస్టేషన్ కాలగర్భంలో కలిసిపోయింది. దీంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత రైల్వే అధికారులు స్పందించి రెడ్డిపల్లి రైల్వేస్టేషన్‌లో ఇంటర్ సిటీ ప్యాసెంజర్, అరక్కోణం ప్యాసెంజర్‌లను నిలుపుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు.



రెడ్డిపల్లి రైల్వేస్టేషన్ చిత్రం

పెరుగుతున్న టమాటా ధరలు

- మార్కెట్లో కిలో టమాటా రూ.30
- ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి తగ్గుతున్న స్టాకు
- 2 వేల నుంచి 300 మెట్రిక్ టన్నులకు పడిపోయిన దిగుబడి
- వారం రోజులు 50 శాతం పెరిగిన టమాటా ధరలు



మార్కెట్‌లో రవాణాకు సిద్ధంగా ఉన్న టమాటాలు

గుర్రంకొండ: జిల్లాలోని మార్కెట్లలో టమాటా ధరలు భారీగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో కిలో టమాటా రూ.30 వరకు ధర పలుకుతోంది. గత వారం రోజుల క్రితం కిలోరూ.12 నుంచి రూ.14 వరకు మాత్రమే ఉండేవి. వారం రోజుల్లోనే 50 శాతంకు పైగా టమాటా ధరలు పెరగడం గమనార్హం. ఉమ్మడి అనంతపురం జిల్లాలో టమాటా తోటలు దెబ్బతిని అక్కడి నుంచి మన జిల్లాకు వచ్చే టామాటాల దిగుబడి 2వేల మెట్రిక్ టన్నుల నుంచి 300 మెట్రిక్ టన్నులకు పడిపోయింది. దినికి తోడు మన జిల్లాలోనూ టమాటా పంట దిగుబడి ఇప్పుడిప్పుడే పెరుగుతోంది. రాబోయే రోజుల్లో టమాటా ధరలు మరింత పెరిగే అవకాశముందని వ్యాపార వర్గాలు అంటున్నాయి.

18654 ఎకరాల్లో ప్రస్తుత పంట దిగుబడి

జిల్లాలోని అన్ని మార్కెట్ కమిటీ యార్డు పరిధిల్లో ప్రస్తుతం 18654 ఎకరాల్లో టమాటా పంట దిగుబడి వస్తోంది. నెల రోజులుగా అనంతరపుం జిల్లాలో తోటలు దెబ్బతిని పంట దిగుబడి తగ్గిపోయింది. అయితే రాయలసీమ జిల్లాల్లో ముఖ్యంగా మనజిల్లాలో ఎక్కువగా టమాటా పంట సాగుచేస్తుంటారు. పదిహేనురోజుల క్రితం వరకు వైరస్‌లు, ఇతరరోగాలతో జిల్లాలో టమాటా తోటలు దెబ్బతిన్నాయి. దీంతో కొంతవరకు దిగుబడి తగ్గిపోయింది. ప్రస్తుతం మళ్లీ జిల్లాలో టమాటా దిగుబడులు పెరగడంతో మండీల టమాటాల స్టాకుతో కళకళలాడుతున్నాయి.

పుంజుకొంటున్న ధరలు

ప్రస్తుతం జిల్లాలోని మార్కెట్‌యార్డుల్లో టమాటా ధరలు పుంజుకొంటున్నాయి. వారం రోజుల కిందట కిలో టమాటా రూ.12 నుంచి రూ.14 వరకు ధరలు పలికాయి. 25 కేజీల టమాటా క్రేట్ రూ.300 నుంచి రూ.350 వరకు ధరలు పలికాయి. ప్రస్తుతం మార్కెట్లో టమాటా ధరల పుంజుకోవడంతో కిలో టామాటా రూ.30 వరకు ధరలు పలుకుతున్నాయి. 25కేజీల టమాటా క్రేట్ ధర ప్రస్తుతం రూ.750 వరకు ధరలు పలుకుతున్నాయి. ప్రస్తుతం మొదటి రకం టమాటాకిలో రూ30, రెండోరకం కిలోరూ.24 మూడో రకం రూ.18వరకు ధరలు పలుకుతున్నాయి.

మార్కెట్‌కు వచ్చిన టమాటాల స్టాకు, ధర

తేదీ	స్టాకు(టన్నుల్లో)	ధర (25 కేజీల క్రేట్)
23.10.23	719	రూ.350
24.10.23	752	రూ.400
25.10.23	769	రూ.500
26.10.23	783	రూ.635
27.10.23	814	రూ.680
28.10.23	826	రూ. 730
29.10.23	850	రూ. 750

మార్కెట్‌కు తగ్గిన దిగుబడి

పదిహేను రోజుల క్రితం వరకు ఉమ్మడి అనంతపురం జిల్లాల నుంచి మన జిల్లాకు 2వేల మెట్రిక్ టన్నుల టమాటాల స్టాకు వచ్చేది. జిల్లాలో ములకలచెరువు, అంగళ్లు, మదనపల్లె, గుర్రంకొండ టామాటా మార్కెట్లకు ప్రతిరోజూ బయట జిల్లాల నుంచి 2 వేల మెట్రిక్ టన్నుల వరకు టమాటాల స్టాకు వచ్చేది. అక్కడి తోటలు దెబ్బతిని ప్రస్తుతం 300 మెట్రిక్ టన్నుల టమాటాల స్టాకు మాత్రమే జిల్లాకు వస్తోంది. దీంతో బయట జిల్లాల నుంచి 80 శాతం మేరకు పైనే టామాటాల స్టాకు రావడం తగ్గిపోయింది. దీనికితోడు మన జిల్లాలో ఇప్పుడిప్పుడే టమాటాల దిగుబడి పెరగడం ప్రారంభమయ్యింది.

ధరలు మరింత పెరిగే అవకాశం

ప్రస్తుతం రోజురోజుకు టమాటా ధరలు పుంజుకొంటుండడంతో రైతుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. ఉమ్మడి అనంతరపురం జిల్లాలో టమాటాల స్టాకు తగ్గుతుండడంతో రాబోయే రోజుల్లో టమాటా ధరలు మరింతగా పెరిగే అవకాశముందని వ్యాపార వర్గాలు అంటున్నారు.

ఐకమత్యంతో సమస్యలు పరిష్కరించుకుందాం

వాల్మీకిపురం: విశ్రాంత ఉద్యోగులంతా కలసి కట్టుగా సమస్యలను పరిష్కరించుకుందామని విశ్రాంత ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షులు రమణ అన్నారు. ఆదివారం పట్టణంలోని కొత్తపేటవీధిలో ఏర్పాటు చేసిన తాలూకా విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై ఉమ్మడి పోరాటం చేస్తామన్నారు. మన సంఘంలో ఎవ్వరికైనా సమస్యలు తలెత్తితే, ఆ సమస్యలను విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం కోసం పని చేస్తోందన్నారు. సంఘంలో సభ్యులకు ఏ సమస్యలున్నా సంఘం దృష్టికి తీసుకురావాలని, సమస్యల పరిష్కారానికి సంఘం సభ్యులు అందరూ కలసి సమిష్టిగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌బిఐ మేనేజర్ శివకుమార్, ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ క్రిష్ణమూర్తి, విశ్రాంత ఉద్యోగులు శంకరయ్య, నారాయణ, మస్తాన్, శంకర్ రెడ్డి, రామమూర్తి నాయుడు, రాజగోపాల్, క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

హోరాహోరీగా బాస్కెట్‌బాల్ పోటీలు

మదనపల్లె సిటీ: స్థానిక బీటీ కాలేజీ మైదానంలో రాష్ట్ర 67వ అండర్–19 బాల, బాలికల బాస్కెట్‌బాల్ పోటీలు హోరీ హోరీగా సాగుగుతున్నాయి. బాలుర విభాగంలో పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, విశాఖపట్నం, క్రిష్ణా జిల్లాల జట్లు సెమిఫైనల్స్‌కు చేరుకున్నారు. బాలికల విభాగంలో తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జట్లు చేరుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి వివిధ జిల్లాల మధ్య పోటీలు రసవత్తరంగా జరిగాయి. సోమవారం ఫైనల్స్ మ్యాచ్‌లు జరుగుతాయని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శులు జయరామయ్య, వసంత తెలిపారు.

అలరించిన ఆటాపాటా

కడప కల్చరల్ : ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా కడప శిల్పారామంలో చిన్నారుల ఆటాపాటా అందరినీ అలరించింది. పాటలకు చిందులు వేస్తూ చేసిన నృత్య ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. కడప నగరానికి చెందిన కిశోర్ డ్యాన్స్ అకాడమీ చిన్నారులు ఈ సందర్భంగా ప్రముఖ సినీ గీతాలతోపాటు శాస్త్రీయ నృత్యాలు ప్రదర్శించారు.

1 నుంచి యోగా శిక్షణ

కడప కల్చరల్ : పటేల్ రోడ్డులోని మిత్ర యోగా సెంటర్‌లో నవంబరు 1 నుంచి యోగా శిక్షణా శిబిరాన్ని నిర్వహించనున్నట్లు యోగా నిపుణులు డాక్టర్ ఆర్. రంగనాథరెడ్డి, యోగా థెరపిస్టు కె.కల్పన తెలిపారు. వారు మాట్లాడుతూ రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి, మానసిక ఒత్తిడి తగ్గించుకోవడానికి అవసరమైన యోగాసనాలు, ధ్యానం, యోగ ప్రక్రియలను శాస్త్రీయంగా సాధన చేయిస్తామన్నారు.